క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీలో చేరేందుకు గడువు పొడిగింపు

ఆత్మకూరు : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం చదివేందుకు దరఖాస్తుల గడువు అక్టోబరు 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఆత్మకూరులోని ఎస్ఆర్ జేడీ కళాశాల ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం కో–ఆర్డినేటర్ జి.శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ డిగ్రీలో చేరేందుకు నేరుగా అనుమతులు ఉన్నాయని, ఇంటర్మీయడిట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన వారు ఓపెన్ డిగ్రీలో చేరేందుకు అర్హులని ప్రకటనలో వివరించారు. వివరాల కోసం 73829 29793 నంబరులో సంప్రదించాలన్నారు.

వేదగిరిని దర్శించుకున్న అడిషనల్ జిల్లా జడ్జి



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై కొలువైన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లా ఐదో అదనపు జడ్జి సరస్వతి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారి సన్నిధిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు



నరసారెడ్డిపాళెంలో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ నరసారెడ్డిపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ తల్లికి ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపుగా మహిళలు పోలేరమ్మ తల్లి ఆలయం వద్దకు చేకురున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహికంగా పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామానికి ఎలాంటి కీడు జరగకుండా చూడాలని మొక్కుకున్నారు.

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక, జలదంకి, చామదల గ్రామాల్లో ఆదివారం పోలేరమ్మకు పొంగళ్లు పెట్టారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. తమ కుటుంబాల్లో పాడి పంటలు వృద్ధి చెందాలని వేడుకున్నారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి జరుగనున్న 49వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డికి దేవస్థానం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. రామమూర్తినగర్‌లోని ఎంపీ ఆదాల కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు జీ దొరబాబు, ఎం రామమోహన్‌రెడ్డి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మతల్లికి పొంగళ్లు



మాతమ్మ తల్లికి ఊరేగింపుగా పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న చిరంజీవిరెడ్డి దంపతు

కలిగిరి: అనంతపురం గ్రామ దేవత మాతమ్మ తల్లికి ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, ఎంపీపీ శిరీష దంపతులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ

- పునర్నిర్మాణానికి రూ.139 కోట్ల మంజూరు
- వేగంగా నిర్మాణ పనులు
- మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ



పొదలకూరు పట్టణంలో నిర్మించిన సీసీరోడ్డు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే కొన్ని రోడ్ల నిర్మాణ పనులు జరుగుతుండగా మరికొన్ని ప్రారంభించాల్సి ఉంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆర్‌అండ్‌బీ శాఖకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.139 కోట్లు మంజూరు చేయించి రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పొదలకూరు పట్టణంలో రెండున్నర దశాబ్దాలకు పూర్వం నిర్మించిన సీసీరోడ్డు ప్రస్తుతం దెబ్బతింది. దీనివల్ల వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి సీసీరోడ్డు విస్తరణ పనులను రూ.2 కోట్లతో చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో..

ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రూ.87.50 కోట్లను రహదారులకు, రూ.22 కోట్లను బ్రిడ్జి నిర్మాణాలకు వెచ్చిస్తున్నారు. మరో రూ.29 కోట్లు నియోజకవర్గంలో రోడ్ల ఆధునికీకరణకు మంజూరు చేయించారు. మొత్తంగా చూసుకుంటే రూ.139 కోట్లు ఆర్‌అండ్‌బీ ద్వారా రహదారుల నిర్మాణానికి ఖర్చుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా పొదలకూరు–సోమశిల, పొదలకూరు–విరువూరు, మనుబోలు–పొదలకూరు ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.13.50 కోట్లు, వెంకటాచలం మండలంలో నెల్లూరు–అనికేపల్లి వయా గొలగమూడి, తిరుమలమ్మపాళెం రోడ్డు, నారాయణరెడ్డిపేట–తోటపల్లిగూడూరు, ఎన్‌పీఎస్ రోడ్డు కృష్ణపట్నం వయా పొలిచెర్లపాడు రోడ్లకు రూ.17.55 కోట్లు, నెల్లూరు–పొదలకూరు–సైదాపురం రోడ్డు, నెల్లూరు–కృష్ణపట్నం రోడ్డు, వెంకటాచలం–ముత్తుకూరు రోడ్లకు రూ.22.25 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారులు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలను కలిపేవి కావడంతో మంత్రి కాకాణి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.

పీఆర్ రోడ్లకు రూ.59 కోట్లు

పంచాయతీ రాజ్ ద్వారా నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల రోడ్లకు రూ.59 కోట్లను మంత్రి కాకాణి మంజూరు చేయించారు. గతంలో సోమిరెడ్డి ఏషియన్ బ్యాంకు ద్వారా రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాలు వేసి వెళితే ఇప్పటి ప్రభుత్వం రాష్ట్ర భాగస్వామ్యం కింద 25 శాతం నిధులను వెచ్చించి



ఆర్‌అండ్‌బీ గ్రామీణ రహదారి

గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లను పూర్తి చేయించడం గమనార్హం. మొగళ్లూరు, బిదరవోలు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా బోగసముద్రం రోడ్డు పనులను చేపడుతున్నారు. మరో రెండు మాసాల్లో నియోజకవర్గంలో రహదారుల ఆధునికీకరణ, మరమ్మతులు పూర్తి చేసి ప్రజలు సుఖవంతమైన ప్రయాణం చేసేందుకు మంత్రితో పాటు, అధికారులు కృషి చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

పొదలకూరు : మేజర్ పంచాయతీ పొదలకూరులో వార్డుల వారీగా రెండు మాసాల పాటు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పంచాయతీ ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ముందుగా ఆదివారం ఒకటో వార్డులో సభ్యుడు ఎస్‌కే అంజాద్‌తో కలిసి పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. దోమల ఉధృతి పెరగకుండా వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తామన్నారు. చట్టుపక్కల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు ఫాగింగ్ చేయించడం వల్ల చాలావరకు దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని,



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

వీధిలైట్లు వెలగకుంటే ఆయా ప్రాంతాల వారు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుద్ధ్య పనులకు పంచాయతీ ప్రజలు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

బుచ్చి ఉపాధ్యాయుడికి పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్ ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా ఆదివారం ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యాబోధనలో సుధీర్‌కుమార్ వినూత్నమైన విధానాలను అనుసరిస్తూ ఆటపాటల ద్వారా విద్యను అందించడంలో ప్రత్యేక గుర్తింపు సాధించారని ప్రశంసించారు. కాగా పురస్కారం అందుకున్న సుధీర్‌కుమార్‌ను ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నం, ఉపాధ్యాయులు అభినందించారు.



పురస్కారం అందుకున్న సుధీర్‌కుమార్

15 ఏళ్లుగా ఈ కారు ఇక్కడే..!

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం సమీపంలో 67వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఓ కారు 15 ఏళ్లుగా ముళ్ల పొదల్లో ఎవరికి కనిపించకుండా ఉండిపోయింది. ఇటీవల ఆ ప్రాంతంలో ముళ్ల తుప్పలు తొలగించడంతో ఆ కారు మరోసారి వెలుగు చూడడంతో చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా ఉన్న కొందరు చెబుతున్న సమాచారాన్ని బట్టి అప్పట్లో రాయలసీమకు చెందిన ఒక నాయకుడి అనుచరుడు ఎర్రచందనం తరలిస్తుండగా ఈ కారు ఓ గేదెను ఢీకొట్టి ప్రమాదానికి గురైంది. కారుకు ముందు, వెనుక వేర్వేరు నంబరు ప్లేట్లు ఉండగా, వాహనం నడుపుతున్న వ్యక్తి అప్పటికప్పుడే ఆ రెండు నంబరు ప్లేట్లను తీసుకుని ఉడాయించినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత కాలంలో రోడ్డు పక్కన నిలిపిన కారు చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోవడంతో ఈ విషయమై ఎవరూ దృష్టి సారించిన దాఖలాలులేవు. సాధారణంగా ప్రమాదాలకు గురైన వాహనాలను సంబంధిత పోలీసులు స్వాధీనం చేసుకోవడమో, అవసరమైతే కోర్టుకు స్వాధీనం చేయడం జరుగుతోంది. ఇలాంటివేమి లేకుండానే ఈ కారు ఇక్కడ ఉండడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. కానీ ఈ కారును అప్పటి నుంచి ఇలా ఎందుకు వదిలేశారో ఇప్పటికీ అర్థం కాని ప్రశ్నగా



డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కారు

మిగిలిపోయింది. 15 ఏళ్లలో కారు టైర్లు, టేప్ రికార్డర్, బ్యాటరీ తదితర ఇతర విడి భాగాలు చోరీకి గురైనట్లు ప్రస్తుత పరిస్థితి బట్టి తెలుస్తోంది. ఇటీవల ఆ ప్రాంతంలో ఉన్న కంప చెట్లను తొలగించడంతో శిథిలావస్థకు చేరిన ఆ కారు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారికి కొత్తగా కనిపిస్తోంది. దీంతో ఈ కారు గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. రవాణా, పోలీసుశాఖ అధికారులు స్పందించి పాత రికార్డులు తిరగేస్తే ఈ కారు వెనుక మిస్టరీ వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

16న మాతమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీమాతమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 16వ తేదీన గ్రామ నాభి శిలాప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకుడు కాటంరెడ్డి వసంతకుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి సాంప్రదాయబద్ధంగా ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి తదితరులు హాజరవుతారని తెలియజేశారు.



నిర్మాణం పూర్తయిన మాతమ్మ ఆలయం

నగర వనం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- సీసీఎఫ్ వై శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బారకాసు): నగరానికి సమీపంలోని పొదలకూరు రహదారి పక్కన అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగర వనాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వై శ్రీనివాసులురెడ్డి అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఆదివారం నెల్లూరు వచ్చిన ఆయన జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్, ఇతర అధికారులతో కలిసి నెల్లూరు నగర వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ నెల్లూరు నగర ప్రజలకు అహ్లాదాన్ని కలిగించేలా, సేదతీరేందుకు నగర వనాన్ని ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఇంకా అరకొరగా మిగిలిన పనులను పూర్తిచేసి మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. నగర వనంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా నగర వనం ప్రాంతంలో ఉన్న కొండమీదకు ఎక్కి ప్రజలు ప్రకృతి అందాలను తిలకించేలా తగిన సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జి నెల్లూరు ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి, ఎఫ్ఎస్ఓ శేషయ్య, ఎఫ్‌బీఓ మనోజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి

కొడవలూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామగ్రి వచ్చాయి. మండలంలో 78 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుండగా, వీటన్నింటికీ అవసరమైన వంట పాత్రలు ఆదివారం ఎంఈఓ కార్యాలయానికి చేరాయి. భోజనం వండే పాత్రలు, వడ్డించే పాత్రలు, కూరలు వండే పాత్రలు, అవసరమైన గరిటెలు కార్యాలయానికి చేరాయి. పాఠశాలల్లో చాలా ఏళ్ల క్రితం నుంచి ఉన్న వంట పాత్రలు ప్రస్తుతం అధ్వానంగా ఉంది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి పోవడంతో వెంటనే స్పందించి మధ్యాహ్న భోజనానికి అవసరమైన అన్ని పాత్రలను పాఠశాలలకు పంపిణీ చేసింది. వీటికి సోమవారమే అన్ని పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. అన్ని పాఠశాలలకు అవసరమైన మేర పాత్రలు పంపిణీ చేయడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఎంఈఓ వెంట సీఆర్పీలు లీలయ్య, మస్తాన్ ఉన్నారు.



పాఠశాలలకు ఇవ్వనున్న వంట సామగ్రి ఇవే

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

మనుబోలు : పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.మోహన్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికై సీపీఎం చేపట్టిన పాదయాత్ర ఆదివారం మనుబోలుకు చేరుకుంది. కార్మిక సంఘం నాయకులు పాదయాత్రకు పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. ఈనెల 13న నెల్లూరులో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం నేతలు గోగుల శీనయ్య, శివకుమారి, పెంచల నరసయ్య, తిరుపాలు, అంకయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



పాదయాత్రలో సీపీఎం నాయకులు

సర్వజనుల శ్రేయస్సును కాంక్షించేదే సనాతన ధర్మం

నెల్లూరు(బృందావనం): సర్వజనుల శ్రేయస్సును కాంక్షించే ప్రపంచానికి ఆధ్యాత్మిక వెలుగులను ప్రసాదిస్తున్న సనాతన ధర్మాన్ని దూషించడం, అవహేళన చేయడం మానసిక మరుగుజ్జుతనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి పేర్కొన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో హైందవ ధర్మ ఆచార, వ్యవహారాలు, సనాతన ధర్మ విశిష్టతను చాటుతూ ''సనాతన ధర్మం వర్థిల్లాలి'' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందికట్ల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నత విలువలు కలిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బ్రహ్మజ్ఞాని రాఘవేంద్ర గోపిస్వామి, మల్లవరపు శరవణస్వామిని ఘనంగా సత్కరించారు. ఔత్సాహిక గాయకులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు బత్తిన సాయికుమార్‌రెడ్డి, చీమకుర్తి వెంకటేశ్వరరావు, పీ సుజాతరెడ్డి, మారం సుధాకర్, వెన్నెల, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, డీ సునీల్‌బాబు, అడ్వొకేట్ రామకృష్ణ, మిడతల రమేష్, పాట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అర్చకులకు సత్కారం

నేడు ఆర్‌వైపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పొదలకూరు : మండలంలోని ఆర్‌వైపాళెం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

పంట నమోదుకు రేపు తుది గడువు

కొడవలూరు : పంట నమోదుకు మంగళవారంతో గడువు ముగుస్తుందని ఏఓ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులు ఈ–కేవైసీ చేసుకునేందుకు కూడా మంగళవారమే తుది గడువుగా నిర్ణయించినట్లు చెప్పారు. సున్నావడ్డీ పంట రుణాలు, పంట రుణాలు, పంట నష్టం తదితరాలు పొందాలంటే పంట నమోదును ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. అందువల్ల ప్రతి రైతు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు పంట నమోదు, ఈ–కేవైసీ చేసుకోని రైతులుంటే రెండ్రోజులే గడువు ఉన్నందున ఈలోపు చేసుకోవాలని ఆమె సూచించారు.

నేటి నుంచి గంధ మహోత్సవం

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షా మష్ కూర్ దర్గాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు గంధ మహోత్సవం జరుగుతుందని దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా సాహెబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ రాత్రి 7 గంటలకు ఘనంగా గంధ మహోత్సవం ప్రారంభమవుతోందన్నారు.

ఘనంగా పాస్టర్స్ డే



పాస్టర్లు శామ్యూల్‌కుమార్, మోసెస్ దంపతులకు సత్కారం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ది తెలుగు సెకండ్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పాస్టర్ రెవరెండ్ శామ్యూల్ కిషోర్, బ్రాంచ్ సంఘ పాస్టర్ రెవరెండ్ మోసెస్ దంపతులను సంఘ చైర్మన్ ఉరందూరు సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, వైస్‌చైర్మన్ అగ్గిరప్ప, సహాయ కార్యదర్శి స్వజని, కోశాధికారి సలోమి, తదితరులు పాల్గొన్నారు.

సమాన ధర్మం కావాలి

నెల్లూరు (టౌన్): సమాజంలో సనాతన ధర్మం కాదు సమాన ధర్మం కావాలని ఆంధ్రప్రదేశ్ శ్రామిక మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ శ్రామిక మహిళా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాదులను, వారిని సమర్థించే వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాఠశాలల విలీనం వల్ల బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. పాఠశాలల పరిరక్షణ, పాత పెన్షన్ సాధన కోసం జరుగే పోరాటాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పాముల కలకలం



ఆటోనగర్ వద్ద బైకులో దూరిన పామును చూస్తున్న స్థానికులు

- రెండు వేర్వేరు ఘటనల్లో బైకుల్లో దూరిన పాములు

ఆత్మకూరు: పట్టణంలోని హిల్‌రోడ్డు ఆటోనగర్, కూరగాయల మార్కెట్ వద్ద పార్కింగ్ చేసిన రెండు బైక్‌ల్లో పాములు దూరి కలకలం సృష్టించాయి. ఈ ఘటనలు ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఆటోనగర్‌లో మెకానిక్ పనులు చేస్తున్న క్రమంలో సమీపంలోని చెట్టుపై నుంచి కిందపడిన ఓ పాము నిలిపి ఉన్న బైక్‌లోకి దూరింది. గమనించిన కొందరు బైక్‌లో నుంచి ఆ పామును బయట తీసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఎంత సేపటికి అది వెలుపులకి రాలేదు. దీంతో కొందరు యువకులు సాహసించి బైక్ స్పేర్‌పార్ట్స్‌ను ఒక్కొక్కటిగా విడదీసి శబ్దాలు చేయడంతో బయటకు వచ్చిన పాము ఎదురుగా ఉన్న దుకాణంలోకి దూరింది. ఓ యువకుడు బయటకు తెచ్చి కొట్టి చంపేశాడు. విషపూరితమైన పాముగా గుర్తించారు. ఈ ఘటనకు కొద్ది సేపు ముందర కూరగాయల మార్కెట్‌లో నిలిపి ఉన్న బైక్‌లోకి ఓ పాము దూరింది. మార్కెట్‌లో పనిచేస్తున్న వారు గమనించి బయటకు తీసి చంపేశారు. ఒకే రోజు ఒకే సమయంలో రెండు పాములు వేర్వేరు ఘటనల్లో బైక్‌ల్లోకి దూరడం పట్టణంలోని చర్చనీయాంశమైంది.



బైక్‌లో దూరిన పామును చంపిన దృశ్యం

ఏజీఎఫ్ అథ్లెటిక్స్‌లో ఆదర్శ కళాశాల విద్యార్థుల సత్తా

కొండాపురం: ఏజీఎఫ్ అథ్లెటిక్స్ క్రీడల ఎంపికలో కొండాపురం ఆదర్శ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా ఆదివారం తెలిపారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగమణి, లీలావతి, సహన, భానుప్రకాష్ ఐదు విభాగాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. దీంతో కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్ బాషా, పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



ఏజీఎఫ్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నాగమణి, లీలావతి, సహన

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఆర్డీఓ కరుణకుమారి

అనుమసముద్రంపేట: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష సర్వే ద్వారా రైతులకు సంబంధించి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆత్మకూరు ఆర్డీఓ ఎస్.కరుణకుమారి అన్నారు. ఆదివారం మండలంలోని పందిపాడులో జగనన్న భూ హక్కు భూ రక్ష సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ రీసర్వే ప్రవేశ పెట్టడం వల్ల ఎంతో మంది రైతులు తమ భూ రికార్డులను కచ్చితంగా తెలుసుకుంటున్నారన్నారు. రైతుల భూమి హద్దులు తెలియక ఇప్పటి వరకు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సర్వే వల్ల రైతులకు హద్దులు సైతం తెలుసుకునేందుకు సునాయాసంగా ఉంటుందని తెలిపారు. రైతులు ఇక నుంచి భూ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు డిజిటలైజేషన్‌లో నమోదు చేసి సచివాలయాల్లోనే కచ్చితమైన పరిష్కారం రైతులకు చూపనున్నట్లు ఆమె తెలిపారు. భూ రీసర్వే వల్ల రైతులకు ఎటువంటి నష్టం జరగదని, రైతులు సైతం రెవెన్యూ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. ఆమె వెంట జిల్లా సర్వే ఏడీ ఏ ప్రసాద్, డీఐ శేషగిరిరావు, ఏఎస్‌పేట సర్వేయర్ అజీజ్, గ్రామ సర్పంచ్ అల్లంపాటి కొండారెడ్డి, వీఆర్ఓ హజరత్తయ్య, సచివాలయ సర్వేయర్లు కిరణ్, వంకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



భూ హద్దులను పరిశీలిస్తున్న ఆర్డీఓ